ఉప్పల్ ఓటర్లు 529416

ఉప్పల్, ఫిబ్రవరి 8 : ఉప్పల్ నియోజకవర్గ ఓటర్ల జాబితాను గురువారం అధికారులు విడుదల చేశారు. అసెంబ్లీ పరిధిలోని కాప్రా, ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో 529416 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. కాప్రా సర్కిల్ పరిధిలోని 236 పోలింగ్ స్టేషన్లుండగా, 308369 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 160130 మంది పురుషులు, 221047 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అదేవిధంగా ఉప్పల్ సర్కిల్ పరిధిలో 115099 మంది పురుషులు, 105930 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో 407 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 275229 మంది పురుషులు, 254147 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరితోపాటుగా 40 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. సర్వీసు ఓటర్లు 158 మంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శామీర్‌పేట్, ఫిబ్రవరి 8: మరమ్మతుల కారణంగా అలియాబాద్ సబ్ స్టేషన్‌లోని 33/11 కేవీ లక్ష్మాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నారాయణపూర్, వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్ల ఏఈ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

మేడ్చల్ పట్టణ పరిధిలో..

మేడ్చల్, ఫిబ్రవరి 8 : మేడ్చల్ పట్టణ పరిధిలోని కిష్టాపూర్‌కు శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధించనున్నట్టు పట్టణ ఏఈ శశిధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్కేపురం చెరువు అభివృద్ధి పనులు పరిశీలన

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 8: నేరేడ్‌మెట్ డివిజన్ ఆర్కేపురం చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్కేపురంలోని బ్రిడ్జి సమాంతరంగా నూతన బ్రిడ్జి ప్రతిపాదనలపై రైల్వే, ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అనంతరం ఆర్కేపురం చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదఖ్ రైల్వే బ్రిడ్జి ఇంజినీర్ జగదీశ్, ఎస్‌సీ ప్రసాద్, ప్రకాశ్, జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు ఛీఫ్ ఇంజినీర్ సురేశ్, డి. ఈ రేణుక, ఏఈ సాయికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు జీకే హన్మంతరావు, ఉపేందర్, పరశురాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆర్కేపురం బ్రిడ్జి వద్ద ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

క్రీడలతో మానసిక ఉల్లాసం

పాలిటెక్నిక్ మైదానంలో జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్, ఫిబ్రవరి 8: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. గురువారం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వెంకట్‌రెడ్డినగర్ సత్యసాయి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధృఢత్వాన్ని , మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడల నిర్వాహకుడు సాయికిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, నాగేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ బీవీచారి, సోమిరెడ్డి, జైనీవన్, సోమనారాయణరెడ్డి, సూరంశంకర్, పవన్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి, అధికారులు

మురికివాడల అభివృద్ధికి కృషి

రామంతాపూర్, ఫిబ్రవరి 8: మురికి వాడల అభివృద్ధికి కృషి చేస్తానని రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. గురువారం డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. మురికి వాడల అభివృద్ధిలో భాగంగా నెహ్రూనగర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. నెహ్రూనగర్‌లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగమణి, ఏఈ శ్వేతారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, నాయకులు వెంకట్‌రావు, కుమారస్వామి, నారాయణదాసు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చైతన్యరథం నాటిక

మల్లాపూర్, ఫిబ్రవరి 8: తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర నాటక రంగ అభివృద్ధి సంస్థ సౌజన్యంతో రాధ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం ఆవరణలో 25వ వార్షికోత్సవం సందర్భంగా చైతన్యరథం సందేశాత్మక నాటిక ప్రదర్శనను నిర్వహించారు. రచన రక్తకన్నీరు నాగభూషణం, బళ్లారి రాఘవ అవార్డు గ్రహీత మాడుగుల కృష్ణమోహన్, తర్కత్వం వి.ఎస్.పి. తెన్నేటిల ఆధ్వర్యంలో నిర్వహించిన నాటిక ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ ప్రదరన్శనలో నట వర్గం జి. మనుప్రియ, రమేశ్‌గౌడ్, రామాయణం సత్యనారాయణ, గోవింద్ సత్యనారాయణ, ఫణిందర్, సాయిపవన్ పాల్గొన్నారు.

నాటిక ప్రదర్శనలో ఓ సన్నివేశం

పార్టీ విజయానికి కృషి చేయాలి

బీఆర్ఎస్ మేడ్చల్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్ గురువారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని వారికి సూచించారు.

- మేడ్చల్, ఫిబ్రవరి 8

'శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం' పుస్తకావిష్కరణ

హిందూ ఆచార్య సభ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ' శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం' పుస్తకాన్ని గురువారం నేరేడ్‌మెట్ జీకే కాలనీలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుడు, వ్యాపారవేత్త జీకే హన్మంతరావు, శివ చేతులమీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, బాబురావు, శంకర్ రావు, శ్రీనాథ్ పాల్గొన్నారు. - నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 8

శ్రీదర్శిని హోటల్‌లో అధికారుల తనిఖీలు

మేడ్చల్, ఫిబ్రవరి 8 : శ్రీదర్శిని హోటల్‌లో అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో బుధవారం ఓవ్యక్తి భోజనం చేస్తుండగా కూరలో బొద్దింక వచ్చింది. విషయం మున్సిపాలిటీ అధికారుల దృష్టికి వెళ్లడంతో కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించారు. ఆర్వో రాంచందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ హోటల్ నిర్వహణ సర్టిఫికెట్లు పరిశీలించారు. కిచెన్‌లో తనిఖీ నిర్వహించి, పని చేసే వారు గ్లౌజ్ వాడాలని, తలపై క్యాప్ పెట్టుకోవాలని, పరిశుభ్రంగా ఉండాలని, నోటీసుకు సమాధానం ఇవ్వాలని సూచించారు. హోటల్‌లో ఏమాత్రం అపరిశుభ్రత కన్పించినా, మిగులు పదార్థాల నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపాలిటీ అధికారులు రాంచందర్, శంకర్

ఎల్ఐజీ కాలనీలో

డ్రైనేజీ పనులు ప్రారంభం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి8 : పోచారం మున్సిపాలిటీ ఎల్ఐజీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులకు కౌన్సిలర్ చింతల రాజశేఖర్ గురువారం ప్రారం భించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ నిధులతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తరుచూ డ్రైనేజీ సమస్యలు ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని మున్సిపాలిటీ దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు కేటాయించారని గుర్తు చేశారు.

డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్

మహిళల్లో చైతన్యం దిశగా కృషి

సమావేశంలో మాట్లాడుతున్న మేడి పాపయ్య మాదిగ

ఉప్పల్, ఫిబ్రవరి 8 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో హబ్సిగూడలో గురువారం తెలంగాణ మాదిగ మహిళా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు మేడి పాపయ్య, మాజీ అడిషనల్ సెక్రటరీ సుభద్ర హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ మహిళల్లో చైతన్యం దిశగా కృషి జరుగాలన్నారు. మాదిగ మహిళలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమంలో తగిన అవకాశాలు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ మహిళలు సంఘటితమై చైతన్యంతో రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత రాజలింగం, డా.మేడి రమణ, రుక్కమ్మ, లక్ష్మి, డా.అన్నపూర్ణ, రేణుక, లత, మహాలక్ష్మి, కోమల, అమృత, జ్యోతి, అంజమ్మ, చామంతి, జయ, తదితరులు పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

రామంతాపూర్ డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్‌లో నివాసముంటున్న స్వర్ణప్రియ వివాహానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సర్వబాబు యాదవ్ గురువారం రూ. 5 వేలు, వస్త్రాలను అమ్మాయి తల్లికి అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు జానకి పాల్గొన్నారు.

- రామంతాపూర్, ఫిబ్రవరి 8

కాలనీ అభివృద్ధికి పనిచేయాలి

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 8 : కాలనీ అభివృద్ధి కోసం నూతన కమిటీ పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి సూచించారు. నాగారం మున్సిపాలిటీ 17వ వార్డు సత్యనారాయణ కాలనీ నూతన కమిటీని గురువారం ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షులుగా మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగరాజుతో పాటు మిగతా కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్, బీఆర్ఎస్ యువ నేత కౌకంట్ల రాహుల్ రెడ్డిని నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

ప్లాస్టిక్ నిషేధంపై స్పెషల్ డ్రైవ్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 8: పోచారం మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు గురువారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కమిషనర్ వేమన రెడ్డి ఆదేశానుసారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి కుమారి, సిబ్బందితో కలిసి అన్నోజిగూడ సర్వీస్ రోడ్డులో తనిఖీ చేయగా అక్కడ మద్యం దుకాణం వద్ద ప్లాస్టిక్ కవర్లను గమనించిన అధికారులు యజమానికి వెయ్యి రూపాయలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.

మద్యం దుకాణదారుడికి జరిమానా రశీదును అందజేస్తున్న అధికారులు

నిత్యాన్నదాన సత్రానికి విరాళాలు

కీసరగుట్ట ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రానికి గురువారం కొలగొంట్ల భీమేశ్వరస్వామి గుప్త, లీలా రవిగుప్త 10 సీలింగ్ ఫ్యాన్స్, 10 ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, ఎలక్ట్రిక్ మోటర్‌ను సత్రం చైర్మన్ రమేశ్‌గుప్తకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు. - కీసర, ఫిబ్రవరి 8

ప్రధానికి మద్దతుగా నిలువాలి

కీసర, ఫిబ్రవరి 8 : ప్రధాని మోదీకి మరోసారి ప్రజలంతా పూర్తి మద్దతు పలుకాలని ప్రవసా ఇన్‌చార్జి, భోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి మోదీకి మద్దతు పలుకాలని అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలను అందిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ భూమిలో రోడ్డు వేసేందుకు యత్నం

శామీర్‌పేట్, ఫిబ్రవరి 8: ఆలయ భూమిలో ప్రైవేట్ వ్యక్తులు రోడ్డు వేయడానికి ప్రయత్నిస్తున్నారని కేశవరం శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మైసయ్య, మాజీ వార్డు సభ్యులు శ్రీశైలంయాదవ్ ఆరోపించారు. గురువారం రోడ్డు వేసేందుకు యత్నిస్తున్న వారిని అడ్డుకుని తహసీల్దార్ వాణి రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆ లయ భూమిలో రోడ్డు వేసేందుకు య త్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తహసీల్దార్ వాణిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మేడ్చల్, ఫిబ్రవరి 8: మేడ్చల్ అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో అడ్వకేట్‌లు, న్యాయశాఖ సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జనరల్ ఫిజిషియన్, కార్డియాలజీ, పుల్‌మానిలాజిస్ట్, గైనిక్ తదితర పరీక్షలు చేశారు. దాదాపు 300 మందికి ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

శిబిరం ప్రారంభంలో పాల్గొన్న బార్ అసోసియేషన్ సభ్యులు

22వ వార్డులో..

మేడ్చల్ పట్టణంలోని 22వ వార్డులో కౌన్సిలర్ సాటి నరేందర్‌మాధవి ఆధ్వర్యంలో సీఎంఆర్ వైద్యకళాశాల వైద్యనిపుణులు వార్డులోని ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో – గాంధీ బుణాకర్ మేళాలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనల్లో గురువారం పలువురు కళాకారులు ఆకట్టుకున్నారు. ప్రదర్శనల్లో కనకదుర్గ శిష్య బృందం ఝుమ్ ఝుమ్ తనన, జయ వరలక్ష్మీ, శివపంచాక్షరీ, నమశ్శివాయతే, అదిగో అల్లదిగో, నర్తన గణపతిమ్, కృష్ణ శబ్దం, అర్ధనారీశ్వరం, ముద్దుగారే యశోద, జాలరులు కురియగా, తక్కువే మి మనకు, శ్రీకృష్ణ పారిజాతం, భజరే నంద గోపాల హరే, తదితర అంశాలను కూచిపూడి నృత్య రూపకంలో నర్తించి ఆకట్టుకున్నారు. – కొండాపూర్, ఫిబ్రవరి 8

నేడు 'రెమెడీ'లో ఉచిత గైనకాలజీ వైద్య శిబిరం

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 8 : కేపీహెచ్‌బీ కాలనీ 4వ రోడ్డులోని రెమెడీ వైద్యశాలలో ఉచిత గైనకాలజీ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యశాల నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యశాల ప్రాంగణంలో ప్రముఖ గైనకాలజిస్ట్ బీవీ శోభ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రమరహిత రుతుక్రమం/రక్తస్రావం, రుతుక్రమం ముందు తర్వాత వచ్చే సమస్యలు, గర్భ సమస్యలు, దిగువ కడుపునొప్పి, వీపునొప్పి, తెల్లబట్ట అగుట (వైట్ డిశ్చార్జ్ పీవీ), క్యాన్సర్ స్క్రీనింగ్ సమస్యలపై పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి చికిత్సలో రాయితీ ఉంటుందని తెలిపారు.

మెదడుకు పదును పెడితే నిపుణులు అవుతారు..

జీడిమెట్ల, ఫిబ్రవరి 8: మెదడుకు పదునుపెడితే ప్రతి విద్యార్థి భావితరాల నిపుణులు అవుతారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి ఐ.విజయకుమారి అన్నారు. చింతల్ డివిజన్ పరిధి పట్వారీ ఎన్‌క్లేవ్‌లో ఉన్న నవజ్యోతి పాఠశాలలో రెండు రోజుల పాటు జరుగనున్న వైజ్ఞానిక ప్రదర్శన 2024ను ఆమె ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన అకృతులను డీఈఓ తిలకించారు. ఎంఈఓ ఆంజనేయులు, నవజ్యోతి విద్యాసంస్థల చైర్మన్ మలిరెడ్డి ఇందిరా రవీందర్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణ, రూపాంజలి, గాంధీనగర్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటరాములు, రమేశ్, ఏఆర్‌సీ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న డీఈఓ ఐ.విజయకుమారి

చెత్త సేకరించే కార్మికుల మధ్య ఘర్షణ: ఒకరికి తీవ్ర గాయాలు

దుండిగల్, ఫిబ్రవరి 8: చెత్త సేకరణ విషయంలో ఆటోకార్మికుల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు ఏకపక్ష దాడికి దిగగా ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లాకు చెందిన పరమేశ్, తిరుమశ్‌లు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబందించిన చెత్తసేకరణ (స్వచ్ఛ ఆటో) కార్మికులుగా పనిచేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన సుధాకర్ అనే వ్యక్తి సైతం ఇందులోనే చెత్తసేకరణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వీరందరు కార్పొరేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. ఈ నెల 6వ తేదీన రాత్రి 10:30గంటల ప్రాంతంలో సుధాకర్ అనే కార్మికుడు ప్రగతినగర్‌లోని రాంఖీ కన్‌స్ట్రక్షన్స్ ఏరియాలో ఇండ్లలో చెత్తను సేకరిస్తున్నాడు. అయితే ఈ ప్రాంతంలో తాము కొంత కాలంగా చెత్తను తీసుకెళ్తుండగా రాత్రి పూట మీరు ఎందుకు సేకరిస్తారని పరమేశ్, తిరుమలేశ్‌లు సుధాకర్‌ను ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్యన వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పరమేశ్‌పై సుధాకర్, అతడి భార్య శిరీష, మల్లికార్జున్, దస్తగిరి దాడి చేశారు. పరమేశ్ భార్య సువర్ణ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

27 నుంచి సర్టిఫికెట్ కోర్సు ఇన్ యోగా పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా పరీక్షా' తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నామని, పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

బీ ఫార్మసీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ–ఫార్మసీ మొదటి, మూడు, అయిదు, ఏడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని అన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహి స్తామని, పరీక్షా తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలి.

పీజీ కోర్సుల చాలెంజ్ వాల్యుయేషన్‌కు..

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే పీజీ కోర్సుల చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ తదితర కోర్సుల మొదటి, రెండో సంవత్సరం పరీక్షా ఫలితాలను ఇప్పటి కే విడుదల చేశామని, సందేహాలు ఉన్నవారు ఒక్కో పేపర్‌కు రూ.10,000లు చెల్లించి, ఈ నెల 28వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. జవాబు పత్రాల నకలు కావాలంటే ఒక్కో పేపర్‌కు రూ.1,000 చెల్లించి వచ్చే నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ ww w.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.